200 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-రాయచోటి

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాయచోటి ప్రధాన బ్రాంచ్‌లో సాయి ప్రశాంత్ ఆస్పత్రి, డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వారు సంయుక్తంగా ఖాతాదారులు, ఇతరులు దాదాపు 200 మందికి ఉచితంగా జనరల్ హెల్త్ చెకప్, కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సాయి కృష్ణ, డాక్టర్ వీరాంజనేయులు ఈ వైద్య పరీక్షలను చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ జగదీష్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళా సాధికారతను సాధించే దిశగా మహిళల స్వతంత్ర నిర్ణయాలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. నేటి సమాజంలో మహిళలు బహుముఖ పాత్రలు పోషిస్తూ అన్ని రంగాలలో తమ సత్తా చాటుతున్నారని చెప్పారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించినందుకు చీఫ్ మేనేజర్, బ్యాంకు సిబ్బందికి ఖాతాదారులు తమ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, ఎఎల్‌డిఎం వన్నూరుబాషా, బ్యాంకు, ఆసుపత్రి సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

'నవోదయం'తో సారా నిర్మూలన

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-కంభంవారిపల్లె (పీలేరు)

నాటు సారాను నిర్మూలించి భవిష్యత్తు తరాలకు బాట వేద్దామని నాటు సారా తయారు చేసేవారు, తయారీకి సహకరించిన వారిపై పీడీ చట్టాన్ని అమలు చేసి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం కె.వి.పల్లి మండలం జిల్లేలు మంద గ్రామంలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటు సారా నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటు సారాపై ప్రజల్లో అవగాహన కల్పించి నాటు సారా నిర్మూలన కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. గ్రామాలు, పట్టణాలలో అవగాహన సదస్సులు నిర్వహించి నాటు సారా వల్ల ప్రజలకు కలిగే ఆర్థిక సామాజిక ఇబ్బందులపై ప్రజల్లో అవగాహన పెంచడం జరుగుతుందన్నారు. నాటుసారా వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని, భవిష్యత్తు తరాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. నాటుసారాను అరికట్టి ప్రజలందరినీ ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని చెప్పారు. నాటు సారా తయారు చేయడం ఆపేసిన వారికి ఆర్థికంగా రుణాలు అందించడం వ్యాపారాలను ప్రారంభించేందుకు సహాయాన్ని అందించడం వంటి చర్యలు తీసుకుంటుందన్నారు. తాను చదువుకునే వయసులో తన గ్రామంలో నాటు సారా వల్ల ఎన్నో ఇబ్బందులు కళ్ళారా చూశానని ప్రస్తుతం అటువంటివేవీ లేకుండా ప్రజలందరూ జీవనోపాధి వైపు నడిచారని మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారని మంచి వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. నాటు సారా అమ్మే వారికి, కొనేవారికి భవిష్యత్తులో సంక్షేమ పథకాలు లభించే పరిస్థితి ఉండదని దీనిని దృష్టిలో పెట్టుకొని నాటు సారా తయారు చేయడం రవాణా చేయడం కొనుగోలు చేయడం ఆపేయాలని సూచించారు. ఎక్కువ మొత్తంలో బెల్లం అమ్మి నాటు సారా తయారీకి సహకరిస్తే వారి మీద పీడీ చట్టాన్ని అమలు చేస్తామని, నాటు సారా తయారు చేసేందుకు ఏ విధమైన సహాయ సహకారాలు అందించిన వారి మీద కూడా పీడీ చట్టాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. నాటు సారా తయారీ, రవాణా, అమ్మకాలపై ఫిర్యాదులను, రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్-14405కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో చివరిగా నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌరుడు నాటుసారా నిర్మూలనకు కట్టుబడి ఉంటానని తన వంతు బాధ్యతగా నాటు సారా నిర్మూలించేందుకు కృషి చేస్తానని తెలిపే ప్రతిజ్ఞతో కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం గ్రామంలో ఉన్న వివిధ సమస్యలపై ప్రజల నుండి అర్జీలను స్వీకరించి వాటిని త్వరగా పరిష్కరిస్తామని ప్రజలకు తెలిపారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మాట్లాడుతూ 2018లో నవోదయం 1.0 కార్యక్రమాన్ని ఒంగోలులో ప్రారంభించామని తెలిపారు. మళ్లీ నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. నాటు సారా తయారీలో చాలా విషపదార్థాలు ఉంటాయని దానిని తాగితే చిన్న వయసులోనే పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోవడం, కిడ్నీ, లివర్ చెడిపోవడం, 40 సంవత్సరాలలోనే చనిపోవడం వంటి ఎన్నో సమస్యలు ఎదుర్కొంటారన్నారు. వరంగల్‌లో నాటు సారా వల్ల ఎదుర్కొన్న సమస్యలపై ఒక అంతర్జాతీయ సంస్థ ఇచ్చిన 'లిక్కర్ విడోస్' అనే నివేదిక ప్రకారం ఎంతోమంది ఆడవాళ్లు 30 సంవత్సరాలలోనే తమ భర్తలను కోల్పోతున్నారన్నారు. నాటు సారా తయారు చేసే వారి మీద కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకు మునుపు 'నాటు సారాను నిర్మూలిద్దాం- భవిష్యత్తుకు బాటలు వేస్తాం' అనే ఒక వీధి నాటకాన్ని ప్రజలందరికీ ప్రదర్శించగా హర్షధ్వానాలతో ప్రజలందరూ అభినందించారు. కె.వి.పల్లె ఎంపిపి ఈశ్వరమ్మ, జిల్లేలమంద సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ నాటు సారా వల్ల ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని నాటు సారాకు దూరంగా ఉండాలని ప్రజలందరికీ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లా ఎక్సైజ్ శాఖ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎక్సైజ్ అధికారులు

విద్యతోనే మహిళా సాధికారత

- ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి-మదనపల్లె

విద్యతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. అంగళ్లులోని మిట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్‌పి మహిళా అధ్యాపకులు, విద్యార్థినిలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికి చదువే ముఖ్యం కాదని, చదువుతో పాటు జీవిత అనుభవాలు మనకు చాలా నేర్పిస్తాయని పేర్కొన్నారు. అక్షరాస్యతకు, విద్యకు చాలా తేడా ఉందని, అక్షరం తెలిసిన ప్రతి ఒక్కరూ మేధావి కాదన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరికీ చదవడం కన్నా, దానిని వినడం ఎంతో ముఖ్యమని తెలిపారు. మహిళా సాధికారత అంటే గుర్తింపు, హక్కుల గురించి మాత్రమే కాదు, అవకాశాలను సృష్టించడం, భద్రతను నిర్ధారించడం, మహిళలు అభివృద్ధి చెందగల, నాయకత్వం వహించగల వాతావరణాన్ని పెంపొందించడం అని పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి స్కిల్స్ నేర్చుకోవడం చాలా ముఖ్యమని, అవిఏదో ఒక సమయంలో పనికి వస్తుందన్నారు. ఏదో ఒక ఉద్యోగం వస్తే చాలని లేకుండా, మీరు అనుకొనే దానిని సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలోను రాణిస్తున్నారనే విషయాన్ని గుర్తుచేసుకోవాలని, ప్రతి ఒక్కరు మనకు ఈ సొసైటీ ఏమి ఇచ్చిందని కాకుండా సొసైటీకి మనం ఏమి ఇస్తున్నాం అనేది ముఖ్యమని పేర్కొన్నారు. మా తల్లి స్కూల్ ఎడ్యుకేషన్ వరకు చదివారని తెలిపారు. తాను సివిల్స్‌లో విజయం సాధించాలని నాకన్నా మా తల్లి ప్రోత్సాహం ఎంతో ఉందని, ప్రతి విషయంలోనూ మా అమ్మ ప్రోత్సాహం చాలా ఉందని తెలిపారు. ఇప్పుడు ఆ రోల్ నా భార్య తీసుకుందని, వారి ప్రోత్సాహం నాకు చాలా ఉన్నదన్నారు. ప్రతి విషయంలోను మనకు ముందుండి నడిపిస్తున్నారని, మహిళా శక్తికి ఇంతకు మించిన ఉదాహరణ మరొకటి లేదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి సెల్ఫ్ స్టడీ అనేది చాలా ముఖ్యమని తెలిపారు. మనకు ఒక్కొక్కసారి మన వెనుకటి తరగతుల విషయాలు కూడా చదవాల్సి వస్తే మనం మొహమాటం లేకుండా చదవగలిగేలా ఉండాలన్నారు. ఇది సివిల్స్ పరీక్షలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. సెల్ఫ్ కరెక్షన్ ప్రతి ఒక్కరికి చాలా అవసరమన్నారు. ఒకరి మీద ఆధార పడకుండా మీ కాళ్ళ మీద నిలబడే విధంగా ఎదగాలన్నారు ఈ రోజు మహిళలకు చాలా మందికి స్కిల్ సెట్ ఉన్నా కూడా ధైర్యంగా వారి సొంతపని చేసుకోలేని పరిస్థితి అని పేర్కొన్నారు. వీటిని అధిగమించేలా ప్రతి ఒక్కరు ఉండాలని చెప్పారు. రాష్ట్రపతి, హోంమంత్రి వంటి ఎంతో మంది మహిళలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం భరోసా అనే ప్రోగ్రాంను ప్రారంభిస్తుందని, ప్రతి ఒక్క మహిళకు వారి సమస్యలను అందులో చెప్పుకోవడానికి వీలుగా సులభమైన పద్ధతిలో అందజేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు, ప్రెసిడెంట్ ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమీ నాదెళ్ల ద్వారకానాథ్, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, కళాశాల మహిళా సాధికారత సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ షణ్ముగ ప్రియా, మోటివేటర్ స్పీకర్ రాంమూర్తి, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

పరిశ్రమల ఏర్పాటుతో ఆర్థిక ప్రగతి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్లోని తన ఛాంబర్లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఆర్థిక ప్రగతికి పరిశ్రమలు దోహదం చేస్తాయిన్నారు. పరిశ్రమల వల్ల వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించి జిల్లా ఆర్థిక ప్రగతి కూడా మెరుగుపడుతుందన్నారు. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఆ దిశగా జిల్లా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలని తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలలో ఔత్సాహిక నూతన పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా పరిశ్రమల శాఖ అధికారులు, బ్యాంకు అధికారులు దృష్టి సారించాలన్నారు. యువతకు ఉపాధినిచ్చే నైపుణ్య అభివృద్ధి కల్పనలో సంబంధిత అంశాల్లో శిక్షణ అందించి యువ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వారిని ప్రోత్సహించాలన్నారు. పీఎం విశ్వకర్మ పథకాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం జిల్లాలో పరిశ్రమల ప్రగతిపై సమావేశంలో చర్చించారు. ఇందులో సింగిల్ డెస్క్ పోర్టల్ కింద వివిధ కేటగిరీలకు సంబంధించి జిల్లాలో మొత్తం 447 దరఖాస్తులు అందగా ఇప్పటివరకు 436 దరఖాస్తులకు ఆమోదం ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిన వాటికి కూడా అర్హతలను పరిశీలించి త్వరితగతిన ఆయా శాఖలు అనుమతులు జారీ చేయాలని కలెక్టరు సూచించారు. ఈ ఏడాది ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక రాయితీ కోసం దరఖాస్తు చేసుకున్న ఎంఎస్ఎంఈలకు అర్హతల మేరకు లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. జిల్లాలో 33 యూనిట్లకు రూ.2.93కోట్లు మేర రాయితీలు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పెట్టుబడి ప్రోత్సాహక రాయితీ కింద జిల్లాలో మొత్తం 22 యూనిట్లకు రూ.2,72,96,776లు, పావలా వడ్డీ రాయితీ కింద 4 యూనిట్లకు రూ.4,96,592 లు, విద్యుత్ రాయితీ కింద 7 యూనిట్లకు రూ.15,83,583లు మంజూరుకు కమిటీ ద్వారా ఆమోదం తెలియజేశారు. పీఎంఇజిపి పథకం కింద 2024-25లో ఇప్పటివరకు 518 యూనిట్లకు బ్యాంకుల ద్వారా రూ.10.35 కోట్లు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఇంకను బ్యాంకుల వద్ద ఆర్థిక సాయం కోసం ఉన్న దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్‌ను ఆదేశించారు. అనంతరం జిల్లాలో సూక్ష్మ, చిన్న తరహా క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమాలు, ఎపిఐఐసి ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చిన ఔత్సాహిక పరిశ్రమలకు భూమి కేటాయింపు, సేల్ డీడ్ల అనుమతులు గురించి సంబంధిత అంశాలపై ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో నడుస్తున్న పరిశ్రమలకు సంబంధించి అవసరమైన ముడి సరుకు, తదితర అవసరాల కోసం ప్రతిపాదనలు పంపాలని కూడా కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు జి.కృష్ణారావు, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.ఆంజనేయులు, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, విద్యుత్ శాఖ డిఇ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్ కుమార్, డిక్కీ, టిక్కి జిల్లా ప్రతినిధులు శివశంకర్, రామ్మూర్తి నాయక్, సిక్కి అసోసియేషన్ అధ్యక్షులు, ఎపిఐఐసి జోనల్ మేనేజర్, ఎపిస్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, కమర్షియల్ ట్యాక్స్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ఆడటమే లక్ష్యం

- బ్యాడ్మింటన్ క్రీడాకారిణి హోత్రిశ్రీ

ప్రజాశక్తి-పీలేరు

బ్యాడ్మింటన్ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరు స్తున్న పీలేరు పట్టణానికి చెందిన టి.హోత్రిశ్రీ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే లక్ష్యంగా పెట్టుకుంది. మాజీ సైనికుడైన తన తండ్రి టి.ప్రభాకర్‌రెడ్డి జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా తన జీవితాన్ని క్రీడకే అంకితం చేయగా, అదే స్ఫూర్తితో తనను కూడా బ్యాడ్మింటన్‌లో అత్యున్నత స్థాయికి తీసుకెళ్లాలని కృషి చేశారు. తాను తన ఆరవ ఏట లోనే బ్యాడ్మింటన్ క్రీడలో అడుగుపెట్టిన హోత్రిశ్రీ 2017లో గోపిచంద్ అకాడమీలో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పతకం గెలుచుకుంది. రాజమండ్రిలో అండర్-15 విభాగంలో రాష్ట్ర ఛాంపియన్‌గా నిలవడంతో పాటు, అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి ప్రతిభను ప్రదర్శించింది. 2018లో నెల్లూరులో అండర్-14 విభాగంలో మినీ బ్యాడ్మింటన్ ఛాంపి యన్‌గా నిలిచిన హోత్రిశ్రీ, ఢిల్లీ, బెంగళూరు, మణిపూర్, ప్రొద్దుటూరు, తిరుపతిలో జరిగిన అండర్-17 పోటీల్లో విజయం సాధించింది. 2019లో ప్రొద్దుటూరు, బెంగళూరులో సౌత్ జోన్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలను అందుకుంది. 2019లో బ్యాడ్మింటన్‌లో ప్రతిభ చూపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు చేతుల మీదుగా అబ్దుల్ కలాం పుర స్కా రాన్ని అందుకుంది. 2021లో బెంగళూ రులో జరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఛాంపి యన్‌షిప్ పోటీల్లోనూ హోత్రిశ్రీ విజేతగా నిలిచింది. 2024 సెప్టెంబరులో కడప జెఎన్‌టియు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చి చెన్నైలో జరిగే సౌత్ జోన్ పోటీలకు ఎంపికైంది. ప్రస్తుతం కెఎంఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హోత్రిశ్రీ, బ్యాడ్మింటన్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కలలు కంటోంది. తనకు తన నాన్న ఆదర్శం, స్ఫూర్తి అని, తల్లి దండ్రుల ఆశయం మేరకు దేశానికే గర్వకా రణంగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేశారు. అందుకు ప్రభుత్వం, రాజకీయ నాయకులు మరింత ప్రోత్సాహం అందించాలని హోత్రిశ్రీ కోరుకుంటోంది.

సాధించిన కప్పులతో హోత్రిశ్రీ

శ్రీజ్ఞానాంబికలో లివరేజింగ్ అటానమీపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కాలేజీలో జరుగుతున్న రెండు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా శ్రీరంగం మాథ్యూ ఉన్నత విద్యా మండలి అకడమిక్ ఆఫీసర్, విజయవాడ శ్రీరంగం మ్యాథ్యు ముఖ్య అతిథిగా విచ్చేసి లివరేజింగ్ అటానమీ గురించి తెలియచేశారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్, అకడమిక్ కౌన్సిల్, గవర్నింగ్ బాడీ, ఫైనాన్స్ కమిటీల గురించి వివరించారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. అటానమస్ కళాశాలకు సిలబస్‌ను ఇండస్ట్రీకి అనుగుణంగా మార్చుకునే వెసులుబాటు కలదని తెలియచేశారు. స్టాండర్డ్స్‌ను ఎంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అటానమస్ కళా శాలలు సిలబస్ మార్చుకునే వెసులుబాటును విద్యార్థికి ఎంత వరకు ఉప యోగ పడుతుందనే దానిపైన శ్రద్ధ పెట్టాలని తెలిపారు. స్కిల్ ఓరియెంటెడ్ కోర్స్ పెట్టాలని చెప్పారు. టీచింగ్ మెతడాలాజీ, ఎవాల్యుయేషన్ గురించి తెలిపారు. పరీక్షల విభాగం చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థికి పరీక్షలు జరిగిన తరువాతనే ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఫలితా లను ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాదేవి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు 'పెద్దిరెడ్డి' పరామర్శ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ మదనపల్లె మోడ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పుంగనూరు మున్సిపల్ మాజీ చైర్మన్ షరీఫ్‌ను మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పరామర్శించారు. శుక్రవారం మదనపల్లెకు వచ్చిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి మదనపల్లె వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్‌తో కలిసి ఆస్పత్రికి వెళ్లారు. షరీఫ్ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో ఆరా తీసి, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. అందరికీ ఎల్లప్పుడూ అండగా ఉంటామని చెప్పారు. షరీఫ్ పార్టీకి విశేషమైన సేవలు అందించారని గుర్తు చేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి ప్రస్తుతం రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో మదనపల్లె మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా, వైసిపి సీనియర్ నాయకులు బాబ్‌జాన్, మాజీ హజ్ కమిటీ డైరెక్టర్ ఖాదర్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

షరీఫ్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మెగా డిఎస్‌సికి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి సురేష్

ప్రజాశక్తి-రాయచోటి

మెగా డిఎస్‌సికి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా డిఎస్‌సికి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. మెగా డిఎస్‌సికి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ పొందేందుకు బిసి, ఇబిసి కేటగిరీలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10 నుండి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు సొంత జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు అర్హులైన వారు రాయచోటి లోని బిసి సంక్షేమ శాఖ కార్యాలయం (గిరిజన బాలుర పాఠశాల వెనుక, రాజంపేట రోడ్డు)లో దరఖాస్తులు పొంది అక్కడే సమర్పించాలన్నారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభ తేదీ తదితర వివరాలు త్వరలో రాష్ట్ర బిసి వెల్ఫేర్ అధికారులు తెలియజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు రాయచోటిలోని బిసి సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

నేడు పీలేరులో జాతీయ లోక్ అదాలత్

- 9వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు కోర్టు ఆవరణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 9వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో పరిష్కరించుకోడానికి ఉపయోగపడుతుందని అన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించే కేసులకు తిరిగి అప్పీల్ చేసుకునే అవకాశం ఉండదని, దీన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని, శనివారం ఉదయం 10.30 నుండి సాయంత్రం వరకు కేసులు పరిష్కారానికి అవకాశం ఉంటుందని చెప్పారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, ఈ జాతీయ లోక్ అదాలత్‌కి సహకరించాలని తెలియజేశారు.

రంజాన్ మాసం పవిత్రమైనది

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం రామరావు కాలనీ మస్జిద్-ఎ-హజ్రత్ అబూ హనీఫా మసీదులో 3వ వార్డు ఇన్‌ఛార్జి నూర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందుకు ముఖ్య అతిథిగా నిస్సార్ హాజరయ్యారు. ఉపవాస దీక్ష విరమించిన ముస్లిం సోద రులు ఇఫ్తారు విందు స్వీకరించారు. ఈ సందర్భంగా నిస్సార్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఎంతో నిష'తో ఆచరించే రోజా విరమించే సాయంకాల సమయాన ఇఫ్తార్ విందును ఇవ్వడం ఎంతో పుణ్యమన్నారు. దైవత్వాన్ని నింపు కునేందుకు ముస్లింలు నెలరోజులు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించడం ఆనవాయితీనని తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ చైర్మన్ కరీముల్లా, పవన్ తేజ్, చిప్పిలి మల్లికార్జున రెడ్డి, మెహమ్మద్ యూనిస్, యాసిన్, కిజర్, ఆరీఫ్ పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

International Women's Day

నగర పంచాయతీ కమీషనర్ గారికి,
పంచాయతీ సిబ్బందికి,
పట్టణ ప్రజలకు, మహిళలందరికీ
అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

బి.రమాదేవి
నగర పంచాయతీ అకౌంట్ ఆఫీసర్, బి.కొత్తకోట.

పోసాని కృష్ణమురళికి బెయిల్

మంజూరు చేసిన కడప మొబైల్ కోర్టు
కస్టడీ పిటిషన్ డిస్మిస్

ప్రజాశక్తి - కడప

అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌లో సినీ నటుడు, వైసిపి నాయకులు పోసాని కృష్ణమురళిపై నమోదైన కేసుకు సంబంధించి కడప మొబైల్ కోర్టులో ఊరట లభించింది. పోసాని కృష్ణమురళి బెయిల్ పిటిషన్, పోలీసుకస్టడీ పిటిషన్‌లపై కడప ప్రత్యేక మొబైల్ కోర్టులో విచారణ పూర్తయింది. శుక్రవారం కడప ప్రత్యేక మొబైల్ కోర్టు పోసానికి రూ.20 వేల పూచీ కత్తుతో బెయిల్ మంజూరు చేసింది. విచారణకు సహకరించాలని సూచించింది. పోలీస్ కస్టడీ పిటిషన్‌ను కూడా మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ డిస్మిస్ చేశారు. అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పిఎస్‌లో నమోదైన కేసులో పోసాని కృష్ణమురళికి కోర్టు తీర్పు కాస్త ఊరట లభించింది.

పక్కా ఇళ్లకు అదనపు సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి మున్సిపల్ పరిధిలోని వివిధ దశల్లో నిర్మాణంలో ప్రభుత్వ పక్కా గృహాలకు ప్రభుత్వం అదనపు సాయం అందిస్తున్నట్లు హౌసింగ్ ఎఇ దీనదయాల్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.70 వేలు ఆర్థిక సహాయం పొందవచ్చని పేర్కొన్నారు. పునాది పూర్తి చేసుకున్న వారికి, గోడల నిర్మాణం పూర్తైన వారికి మోల్డింగ్ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని తమ ఇళ్లను ఏప్రిల్ నాటికి పూర్తి చేసుకోవాలని హౌసింగ్ కార్పొరేషన్ తరఫున కోరుచున్నట్లు తెలియజేశారు.

International Women's Day

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

మహిళ ఆత్మస్థైర్యం, మనోబలం,
పట్టుదలతో ప్రతి అవకాశాన్ని
విజయవంతంగా మలచుకోవాలని
అన్ని రంగాల్లో మహిళలు మరింత
చైతన్యవంతులై ముందుకు
సాగాలని కోరుకుంటూ...
మహిళలందరికీ
అంతర్జాతీయ మహిళా
దినోత్సవ శుభాకాంక్షలు

పి.శోభారాణి
ప్రధానోపాధ్యాయిని,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
శివరామపురం, పీలేరు మండలం,
అన్నమయ్య జిల్లా.

8 March Happy Women Day

అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

మహిళ ఆత్మస్థైర్యం, మనోబలం,
పట్టుదలతో ప్రతి అవకాశాన్ని విజయంగా
మలచుకోవాలని అన్ని రంగాల్లో
మహిళలు మరింత చైతన్యవంతులై
ముందుకు సాగాలని కోరుకుంటూ...
మహిళలందరికీ
మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

సోమలరాజు భాగ్యలక్ష్మి
అంగన్వాడీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్,
రాయచోటి, అన్నమయ్య జిల్లా.

హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

హుండీ ఆదాయం రూ.1.94 లక్షలు

ప్రజాశక్తి-నందలూరు

ఉమ్మడి జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించగా దాదాపు రూ.1,94,302లు వచ్చినట్లు ఆలయ ఇన్స్‌పెక్టర్ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 రోజుల హుండిని లెక్కించినట్లు తెలిపారు. మొత్తం డబ్బును ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టిటిడి విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌జె వెంకటేష్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ మధు, నాయకులు

ఘనంగా ఆర్‌జె జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్ జన్మదిన వేడుకలను టౌన్ బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిమ్మనపల్లి సర్కిల్‌లోని టిడిపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పూలమాలలు, శాలువాలతో ఆర్‌జెను ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాదెళ్ల విద్యాసాగర్, మాజీ మున్సిపల్ చైర్మన్ కొడవలి శివప్రసాద్ మాట్లాడుతూ టిడిపిలో ఏ పదవి అప్పగించినా సమర్థవంతంగా పనిచేస్తారన్నారు. ఆయన చేస్తున్న సేవలతో సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వద్ద ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అనంతరం ఆర్.జె వెంకటేష్ మాట్లాడుతూ తాను మొదటిసారి 1986 లో సర్పంచ్‌గా ఎన్నికయ్యానని, ఆ రోజుల్లో విలువలతో కూడిన రాజకీయాలు ఉండేవన్నారు. కాలక్రమేణ విలువలు లేని రాజకీయాలు నడుస్తున్నాయని ఇది ప్రజాస్వామ్యానికి హానికరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మధు, సైనిక సంఘం మాజీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు, రాటకొండ మధుబాబు, గంగారపు గౌతమ్ రెడ్డి, నవీన్ చౌదరి, నిమ్మనపల్లి మండల పార్టీ అధ్యక్షులు రమణ పాల్గొన్నారు.

వైసిపి నాయకుడిని పరామర్శిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

వైసిపి నాయకులను పరామర్శించిన 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

మండలం హసనాపురం గ్రామంలో శుక్రవారం పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలను వైసిపి ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. గ్రామంలోని గొల్లపల్లెలో పప్పిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి ఇటీవల ప్రమాదానికి గురై కాలుకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి పొందుతున్నాడు. ఈశ్వర్‌రెడ్డి నివాసానికి శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మోకాలు కీలు మార్పిడి చేయించుకున్న పప్పిరెడ్డి రామిరెడ్డి సతీమణిని, మెడకు శస్త్ర చికిత్స చేయించుకున్న పప్పిరెడ్డి నాగభూషన్‌రెడ్డిని శ్రీకాంత్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. హసనాపురం నకు చెందిన మాజీ డీలర్ మహబూబ్‌బాషా సోదరుడు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై వేలూరులో చికిత్సపొంది, ఇంటివద్ద విశ్రాంతి పొందుచున్నారు. అతన్ని కూడా శ్రీకాంత్‌రెడ్డి కలిసి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్‌లు రాజారెడ్డి, వెంకటేసు, వైసిపి నాయకులు చలమారెడ్డి, కొవ్వూరి ఈశ్వర్‌రెడ్డి, పప్పిరెడ్డి అమరనాధ రెడ్డి, వసంత ఆంజనేయ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, ప్రకాష్ రెడ్డి,ఆరీఫుల్లా, అల్లా బక్ష్ ,సుధాకర్ పాల్గొన్నారు.

రేపు అన్నదాన ట్రస్ట్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మల్లయ్య కొండ కింద మద్దా భక్తుని బావి వద్ద అన్నదాన ట్రస్ట్ భవన్‌లో ఆదివారం ఉదయం 10.30 గంటలకు కమిటీ సమావేశం జరుగుతుందని ఆ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డిలు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాలకు మల్లెకొండకు వచ్చిన భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లు, ఖర్చులు, భక్తులు ట్రస్ట్ కు అందజేసిన చందాలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు, గ్రామస్తులు హాజరుకావాలని కోరారు.

ఎస్‌సి వర్గీకరణ తీర్పు రద్దు చేయాలి

ప్రజాశక్తి-పీలేరు

ఎస్సి, ఎస్‌టి రిజర్వేషన్ల వర్గీకరణ క్రిమిలేయర్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన రాజ్యాంగ వ్యతిరేక తీర్పును రద్దు చేయా లని మాల మహానాడు నాయకులు తెలిపారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని ఫిరోజ్ కల్యాణ మండపంలో మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న తిరుపతిలో చేపట్టనున్న హలో మాల చలో తిరుపతి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తు నిర్వహిస్తున్నట్లు జెఎసి అధ్యక్షులు డాక్టర్ యమలా సుదర్శనం తెలిపారు. మాలల ఉనికిని అనేక కుట్రలతో తగ్గించే పరిస్థితులు రాష్ట్రంలో కొనసాగుతున్నట్లు తెలిపారు. మాలలపై అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు కత్తికట్టాయని ఒక కులానికి కొమ్ముకాస్తున్నాయని తెలిపారు. ఈ సమయంలో మాలల సంఘటిత శక్తిని చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మాలలు ప్రజాస్వామ్యవాదులని, అంబేద్కర్ వారసులని తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్ర మంలో జెఎసి ప్రధాన కార్యదర్శి పూతలపట్టు ప్రభాకర్, చీఫ్ కో–ఆర్డినేటర్ మల్లారపు మధు, ఉపాధ్యక్షులు గుండ్లూరు ధనశేఖర్, ప్రచార కార్యదర్శి సి.చంద్రయ్య, వైద్యఆరోగ్యశాఖ జిల్లా అధ్యక్షులు అరిపెంట లక్ష్మీనారాయణ, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, అధికార ప్రతినిధి హరి, జిల్లా అధ్యక్షులు చింతపర్తి శివయ్య పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన మాలమహానాడు నాయకులు

అగ్నికి ఆహుతైన మామిడి, అల్లనేరేడు చెట్లు

- కాలిబూడిదైన కేబుల్, డ్రిప్ వైర్లు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధిత రైతులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అగ్ని ప్రమాదానికి పూత దశలోని మామిడి తోటలు, అల్ల నేరేడు చెట్లు, నీటి పైపులు, డ్రిప్పు పైపులు, కేబుల్ వైర్లు ఆహుతై రైతులు తీవ్రంగా నష్టపోయిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని బోడుమల్లయ్యగారిపల్లి సమీపంలో ఉన్న ఓబులేసుని కొండ వద్ద శుక్రవారం ఉదయం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు బీడు భూముల్లో నిప్పు అంటించారు. చుట్టుప్రక్కల ఉన్న రైతులు నరేంద్ర, ఖాసిం ఖాన్, భావాఖాన్, నిజాముద్దీన్ లు అగ్ని జ్వాలలను గుర్తించి వెంటనే మరి కొంతమంది రైతుల సాయంతో మంటలను ఆర్పడానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రంగా శ్రమించినా ఫలితం లేకపోయింది. ఓవైపు మంటల ఆర్పుతున్న మరోవైపు గాలి ప్రభావానికి వేగంగా మంటలు వ్యాప్తి చెందుతుండడంతో రైతుల శ్రమ వృధా అయింది. దీనితో చుట్టుప్రక్కల ఉన్న మామిడి తోటలు, అందులోని అల్ల నేరేడు చెట్లు, కొబ్బరి చెట్లు, పైపులు, గడ్డివామి, హై టెన్షన్ విద్యుత్ స్తంభం మొదలైనవి అగ్ని ప్రమాదానికి గురయ్యాయి. సుమారు 12 ఎకరాల్లోని మామిడి తోట, మామిడి తోట చుట్టుపక్కల ఉన్న కంచె కాలడంతో పూత దశలోని మామిడి చెట్లు అగ్ని ప్రమాదానికి గురై కాలిపోవడంతో రైతులు పంట నష్టపోవడం జరిగింది. అగ్ని ప్రమాదానికి కారకులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు. అగ్ని ప్రమాదానికి బావా ఖాన్ మామిడి తోటలో ఉన్న హై టెన్షన్ విద్యుత్ స్తంభం అగ్ని ప్రమాద ధాటికి వంగి పోయింది. సంఘటన స్థలాన్ని తహశీల్దార్ అమర్నాథ్, వాయల్పాడు అగ్నిమాపక సిబ్బంది పరిశీలించారు.

కాలిపోతున్న మామిడి చెట్లు

వంగిన హైటెన్షన్ విద్యుత్ స్తంభం

తీవ్రంగా నష్టపోయాం

గుర్తుతెలియని వ్యక్తులు చేసిన అగ్ని ప్రమాదానికి రైతు ఐదు ఎకరాలలోని మామిడి చెట్లు, 45 అల్ల నేరేడు చెట్లు, 100 మీటర్ల నీటి పైపులు, డ్రిప్పు పైపులు, 100 మీటర్ల పైగా ఉన్న కేబుల్ వైరు అగ్నికి కాలిపోయాయి. పంటతోపాటు, వేల రూపాయల విలువైన పైపులు, కేబుల్ వైరు కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. తమను ప్రభుత్వం ఆదుకోవాలి.

- నరేంద్ర, రైతు.

ప్రభుత్వం ఆదుకోవాలి

కొందరు వ్యక్తులు చేసిన అగ్ని ప్రమాదానికి సుమారు ఏడు ఎకరాలకు పైగా మామిడి తోటలోని పూత దశలో ఉన్న మామిడి పంటను కోల్పోయాం. పంట దిగుబడి వస్తుందన్న ఆశలు ఆవిరి అయ్యా యి. తోటలోని కొబ్బరి చెట్లు, పశువుల కోసం పెట్టుకున్న గడ్డివామి, డ్రిప్పు పైపులు పూర్తిగా కాలి పోవడం జరిగింది. ఇప్పటికే అప్పుల్లో కూరుకు పోయాం. వ్యయసాన్ని నమ్ముకొని జీవిస్తున్నాం. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి తమను ఆదుకోవాలి. లేకుంటే ఆత్మహత్యలే శరణ్యం

- బావాఖాన్, రైతు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం : సిడిపిఒ

రాయచోటి : మాట్లాడుతున్న సిడిపిఒ సుగుణమ్మ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రతి మహిళ నిర్దేశిత లక్ష్యాలను పెట్టుకుని, నిర్ణీత సమయం లో నిర్దిష్ట ప్రణాళికతో కష్టపడితే పురుషులతో పాటు అన్ని రంగాల్లో రానించగలరని సిడిపిఒ సుగుణమ్మ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డీగ్రీ కళాశాలలో శ్రామిక మహిళా సంఘం, సిఐటియు, ఐద్వా రంగాల ఉమ్మడి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిడిపిఒ మాట్లాడుతూ చదువుఒక్కటే మహిళలు ఎదగడానికి ప్రధాన ఆయుధం అని బాగా చదివి ఆర్థిక, సామాజిక, రాజకీయా రంగాల్లో రానించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ హైదర్ అలీ మాట్లాడుతూ మూఢనమ్మకాలు, అసమానతలు, నిర్లక్ష్యం, స్వీయ మానసిక ధోరణి వీడినప్పుడే మహిళలు రానించగలరని తెలిపారు. డి. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కష్టపడితే ఎవరితో నైనా పోటీలో నెగ్గాగలమని నేడు క్రీడల్లో పథకాలు సాధిస్తూ దేశ ప్రతిష్ట ను పెంచడం లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అధ్యాపకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు పని గంటలు పెంచుతున్నారని సమానపనికి సమానవేతనం ఇచ్చినప్పుడే ఆర్థికఅభివృద్ధిసాధ్యం అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో నాటి నుంచి నేటి వరకుమహిళలది ప్రత్యేక స్థానం అని అన్నారు. ఇంటిపనిలో, పారిశ్రామికవాడలో, సాంకేతిక రంగాల్లో రాజకీయాలలో మహిళలు రానించాలంటే ప్రభుత్వాలు మహిళా చట్టాలను హక్కులని కఠినంగా అమలు చేయాలన్నారు. పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులు తీవ్రత తగ్గించాలని కోరారు. మహిళాభివృద్ధికి వారి రిజర్వేషన్ లు సక్రమంగా అమలు చేసినప్పుడే మహిళా సాధికారత పరిపూర్ణత వస్తుందని తెలిపారు. అనంతరం శ్రామిక మహిళా నేత స్వప్న స్త్రీ వివక్ష రూపాలను కష్టాలను పాట రూపంలోవినిపించారు. మహిళా సంక్షేమం కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, భోదనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ : అన్నమాచార్యలో..** మహిళా సాధికారత, వారి పాత్రను ప్రోత్సహించేందుకు అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ కులపతి చొప్ప గంగిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత గురించి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు మాట్లాడారు. యూనివర్సిటీ కులపతి చొప్పా గంగిరెడ్డి, ఉపకులపతి సాయిబాబా రెడ్డి, కడప వైవీ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పద్మ, భవ్య, మౌనిక లు మాట్లాడుతూ విద్య ద్వారా మహిళలు తమ జీవితాన్ని మెరుగుపర్చుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. ప్రిన్సిపల్ ఎస్.ఎం.వి. నారాయణ, రిజిస్ట్రార్ ఎన్. మల్లికార్జున రావు, డీన్ ఎం.సుబ్బారావు, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త ఎన్.ఆర్. గౌతమి ఈ కార్యక్రమంలో పాల్గొని మహిళా సాధికారతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.అనంతరం మహిళా సాధికారతలో విశేషమైన కృషి చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందించారు. **మన్నూరులో..** సమాజంలో మహిళల పాత్ర కీలకమని మన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.పరిమళ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మన్నూరు జడ్‌పి హైస్కూల్‌లో రాజంపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బాల, బాలికలకు కుటుంబం, సమాజం, దేశాభివృద్ధిలో మహిళల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు పరిమళ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. విద్యా రంగంలోనూ ప్రతి ఏడాది బాలికలే ఉత్తీర్ణత శాతం ఎక్కువగా సాధిస్తున్నారని తెలిపారు. స్త్రీ ఒక తల్లిగా, భార్యగా, బిడ్డగా, చెల్లిగా, అక్కగా ఇలా అనేక రూపాలలో అనురాగం, ఆప్యాయతలను పంచుతుందని ఆ భాగ్యం కేవలం స్త్రీలకు మాత్రమే దక్కిందని తెలిపారు. నాడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అంతరిక్ష యానం వరకు వారి ఖ్యాతిని ఇనుమడింపజేసుకున్నారని వివరించారు. అలాంటి నారీ మణులను స్ఫూర్తిగా తీసుకొని బాలికలు అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన 9వ తరగతి విద్యార్థిని సుమియ ప్రథమ బహుమతి, యాషిత ద్వితీయ బహుమతి, 8వ తరగతి విద్యార్థిని జానకి తృతీయ బహుమతి మరియు సన, సుస్మిత, సబిహ సుభానా లు వరుసగా 4,5,6 స్థానాలలో బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో బచోటి భాస్కర్, ఉపాధ్యక్షులు సాంబశివ నాయుడు, ఓబులేసు, ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, కోశాధికారి సునీల్, కళ్యాణ్, నరసింహ, రాయులు,పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఓబులసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పట్టణంలో ప్రసిద్ధిగాంచిన బెసెంట్ థియోసాఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ మధుమతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సమాజంలో స్త్రీకి పూర్వం నుండి మంచి గౌరవం ఉందని, అది ప్రస్తుతం తరంలోనూ, భవిష్యత్ తరాల్లోనూ కొనసాగాలని పిలుపునిచ్చారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శైలజ ముందుండి జరిపిం చారు. అనంతరం రంగోళి, మెహందీ, హెయిర్ స్టైల్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది పెద్దఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

రామాపురం : మనదేశంలో మహిళలు ఉన్న చట్టాలు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ పద్మావతమ్మ పేర్కొన్నారు. రామాపురం మండలం పరిధిలోని గువ్వలచెరువు సెక్టార్ లోని సూర్యనారాయణపురం అంగన్వాడీ కేంద్రంలోఅంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ పద్మావతమ్మ మాట్లాడుతూ మహిళలు విద్యతోపాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. మహిళల హక్కులు, సాధికారిక, సమానత్వం, లింగ నిర్ధారణ, బ్రుణ హత్యలు చట్టరీత్యా నేరం అన్నారు. ఇలాంటి అంశాలపై అవగా హన కల్పించారు. బాల్య వివాహాల వలన ఆడపిల్లలు జరిగే అనర్థాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హుస్సేనమ్మ, సుజాత, పద్మజ, రాణి, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజంపేట : జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చొప్ప గంగిరెడ్డి

రామపురం : మహిళా దినోత్సవ వేడుకల్లో సిడిపిఒ, మహిళలు

సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే

వైసిపి నాయకులతో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఎలాంటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. తంబళ్లపల్లె, పెద్ద తిప్ప సముద్రం, ములకలచెరువు, వైఎస్‌ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా చర్చించారు. నియోజకవర్గంలో వైసిపి మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా పార్టీ పదవిని పొందిన వారు ఎమ్మెల్యేకి పుష్ప గుచ్చాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, వైస్ ఎంపిపి కరీం, కో–ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, పద్మనాభరెడ్డి, బాలకృష్ణారెడ్డి, రామ్మూర్తి, పాల్గొన్నారు.

గృహ విద్యుత్ అదనపులోడు
క్రమబద్ధీకరణకు రాయితీ : ఎఇ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని గృహ విద్యుత్ అదనపు లోడు క్రమ బద్ధీకరణకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు విద్యుత్ వినియోగదారులు తమ వినియోగిస్తున్న అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు జూన్ 30వ తేదీ లోగా స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకున్నట్లయితే ఆ అదనపు లోడు క్రమబద్ధీకరణకు వినియోగ దారులు చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకో వాలని పేర్కొన్నారు. ఒక కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు మును పు 2000 ఇప్పుడు 50 శాతం రాయితీతో రూ.1000 మాత్రమే చెల్లించు కోవచ్చునని తెలిపారు.

కెకె చౌదరికి వినతిపత్రం అందిస్తున్న టిడిపి కార్యకర్తలు

కార్యకర్తల సమస్యల పరిష్కారమే లక్ష్యం : కెకె

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కార్యకర్తల సమస్యల పరిష్కారమే తమ లక్ష్మమని చిట్వేలి మండల టిడిపి అధ్యక్షులు, ఎపి రాష్ట్ర గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కెకె చౌదరి పేర్కొన్నారు. మండలంలోని రాఘవరాజపురం టిడిపి కార్యాలయంలో కార్యకర్తలను వారి సమస్యలను తెలుసుకున్నారు. పలువురు కార్యకర్తలు వారి సమస్యలు చెప్పుకోగా సంబధిత అధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కరించాలని కోరారు. నిచిట్వేలి మండలంలో 2019 నుంచి 2024 వరకు ప్రతిపక్షంలో పార్టీ కోసం కష్టపడిన వారికి వచ్చే నూతన గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర పార్టీ కమిటీల్లో ప్రభుత్వ నామినేటెడ్ పదవులలో తప్పకుండా అవకాశం కల్పించాలని కెకె చౌదరి కోరారు.

'బిట్స్'లో డిప్లొమా కోర్సులకు అనుమతి

ప్రజాశక్తి-రామాపురం

మాట్లాడుతున్న చైర్మన్ భాస్కర్

మండలంలోని భాస్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో డిప్లొమా కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరైనట్లు కళాశాల చైర్మన్ మున్నూరు భాస్కర్ పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్(60సీట్లు) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (60సీట్లు) ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (60సీట్లు) ఆర్టిఫిషి యల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ (60సీట్లు) డిప్లొమా కోర్సులను ప్రారంభించడానికి ప్రభుత్వం అనుమతించిందని అన్నారు. ఈ అవకాశాన్ని రాయచోటి చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు వృత్తిపరమైన విద్యాను అందించడానికి దోహదపడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంత యువతకు ఈ కోర్సుల ద్వారా ఉన్నతమైన సాంకేతి విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వెనుకబడిన ఈ ప్రాంతానికి సాంకేతిక విద్య అందించడానికి తోడ్పాటు అందించిన మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు యథావిధిగా పాఠశాలలు

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండవ శనివారం రోజున యథావిధిగా పాఠశాల నిర్వహించ బడునని మండల విద్యాశాఖ అధికారి చక్రేనాయక్ పేర్కొన్నారు. డిఇఒ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరంలో 220 పని దినాలు తగ్గకుండా ఉండడం కొరకు రెండవ శనివారాన్ని పని దినంగా ప్రకటించబడిందని తెలిపారు. విద్యార్థులు పాఠశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

పుస్తక నిర్వహణ సంఘాలకు కళ్లు లాంటిది

ప్రజాశక్తి-వీరబల్లి

సంఘ సభ్యులతో మాట్లాడుతున్న ఎపిఎం ఖాదర్‌వలీ

పుస్తక నిర్వహణ సంఘాలకు కళ్ళ లాంటిదని వెలుగు ఎపిఎం ఖాదర్‌వలి అన్నారు. శుక్రవారం పెద్దివీడు, ఎలక చెట్టు పల్లి లోని సంఘం సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు క్రమం తప్పక నెలవారీ సమావేశాలు జరుపుకుని తమ లావాదేవీలు సమావేశాల పుస్తకం, వ్యక్తిగత పాసుబుక్స్, అప్పు లెడ్జిర్‌లో నమోదు చేసినప్పుడే పారదర్శకత ఉంటుందని అన్నారు. సంఘం లావాదేవీలు సభ్యులందరు సమావేశంలోనే జరపాలన్నారు. గ్రామ సమాఖ్యల సిబ్బంది సంఘం సమావేశాలకు విధిగా హాజరుకావడం వల్ల పుస్తకానిర్వహణ, సమస్యల పరిస్కారం సాధ్యమైతుందని అన్నారు. సభ్యులు తీసుకొన్న రుణాలతో ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిసి కృష్ణయ్య, విఒఎ హేమలత పాల్గొన్నారు.

వినియోగదారులను చైతన్య పరిచేందుకు కృషి

ప్రజాశక్తి-ములకలచెరువు

జిల్లాలోని వినియోగదారులను చైతన్యపరిచి సంఘటితం చేయడానికి కృషి చేస్తానని మదనపల్లి పేస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ విఎస్.రెడ్డి తెలిపారు. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం సమన్వయకర్తగా పేస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ను కలెక్టర్ ఇటీవల నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం సమన్వయకర్తగా తనను ఎంపిక చేసిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా పౌర సరఫరాల అధికారి రఘురాములకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలలో వినియోగదారుల సమాచార కేంద్రాల ద్వారా వినియోగదారులను చైతన్యపరిచే కార్యక్రమాలను అధికారుల సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ప్రతాప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

చికిత్స పొందుతున్న శ్రీకాంత్

విద్యుత్ ఘాతంతో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో జరిగింది. పోలీసుల మేరకు వివరాలు..పట్టణంలోని బిసి కాలనీకి చెందిన రవి కుమారుడు శ్రీకాంత్ శుక్రవారం శంకరాపురంలో కొత్తిమీర కోయడానికి సహచరులతో వెళ్ళాడని తెలిపారు. కొత్తిమీర కోసి మూటలు కట్టేందుకు పక్కనే ఉన్న కానుగ చెట్టెక్కి ఆకు కోస్తుండగా.. విద్యుత్తు లైను చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. క్షతగాత్రుడిని 108వాహనంలో మదనపల్లెకు తరలించి, చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-పీలేరు

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన పీలేరు మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ బాలకృష్ణ కథన మేరకు.. మండలంలోని రేగళ్ల పంచాయతీ, నగిరి గ్రామానికి చెందిన కృష్ణయ్య(65) గురువారం బయలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, బంధువులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేదని అన్నారు. శుక్రవారం గ్రామ సమీపంలో వ్యవసాయ పొలం వద్ద మృతి చెంది ఉండడాన్ని బంధువులు గుర్తించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న తాము సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నామని చెప్పారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.